హ్యాండ్‌బాల్ విజేత ఆదిలాబాద్

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 2: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ టోర్నీ ముగిసింది. మంగళవారం జరిగిన బాలుర ఫైనల్లో ఆదిలాబాద్ 20-17తో మహబూబ్‌నగర్‌పై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఆది నుంచే తమదైన జోరు కనబరిచిన ఆదిలాబాద్..పాలమూరు టీమ్‌తో ఆఖరి వరకు హోరాహోరీగా తలపడింది. మరోవైపు బాలికల తుది పోరులో వరంగల్ 9-1తో ఆదిలాబాద్‌పై గెలిచి విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో వరంగల్, బాలికల కేటగిరీలో మహబూబ్‌నగర్ జట్లు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు జిల్లా డీఈవో రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు ప్రదానం చేశారు.

జాతీయ అథ్లెటిక్స్ శిబిరానికి కీర్తన

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రానున్న ప్రతిష్ఠాత్మక టోర్నీలైన ఒలింపిక్స్, ఆసియాగేమ్స్ కోసం ఏర్పాటు చేస్తున్న జాతీయ అథ్లెటిక్స్ శిబిరానికి సాంఘిక సంక్షేమ గురుకుల యువ అథ్లెట్ కీర్తన ఎంపికైంది. ఐవోసీఎల్ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద దేశవ్యాప్తంగా 30 మంది ప్రతిభ కల్గిన అథ్లెట్లను ఎంపిక చేయగా, అందులో రాష్ట్రం నుంచి కీర్తనకు అవకాశం లభించింది. వరంగల్ ఎస్సీ గురుకుల అథ్లెటిక్స్ అకాడమీలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్న కీర్తనను అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించింది. భవిష్యత్‌లో కీర్తన మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

భారత్ వైట్‌వాష్

ఆసీస్‌తో మూడో వన్డేలో మన అమ్మాయిల ఓటమి

ముంబై: సుదీర్ఘ ఫార్మాట్‌లో కంగారూలపై ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు.. వన్డేల్లో పూర్తిగా తేలిపోయింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-3తో కోల్పోయింది. మంగళవారం జరిగిన పోరులో ఆస్ట్రేలియా 190 పరుగులతో టీమ్ ఇండియాను ఓడించి సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 338 పరుగులు చేసింది. ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ (119; 16 ఫోర్లు, ఒక సిక్సర్) సెంచరీతో చెలరేగగా.. కెప్టెన్ అలీసా హీలీ (82; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 189 పరుగుల భాగస్వామ్యం జోడించారు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ 3, అమన్‌జ్యోత్ కౌర్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో హర్మన్ బృందం 32.4 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. మంధన (29) టాప్ స్కోరర్ కాగా.. జెమీమా (25), దీప్తి శర్మ (25) కాస్త పోరాడారు. లిచ్‌ఫీల్డ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

అవనీశ్ అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ ఆటగాడు అరవెల్లి అవనీశ్ (60 నాటౌట్; 8 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించడంతో.. దక్షిణాఫ్రికా అండర్-19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో యువ భారత జట్టు గెలిచింది. మొదట దక్షిణాఫ్రికా 46.1 ఓవర్లలో 240 పరుగులు చేసింది. అనంతరం భారత అండర్-19 జట్టు40.5 ఓవర్లలో 3 వికెట్లకు 244 పరుగులు చేసింది. అవనీశ్‌తో పాటు ఆర్షిన్ కులకర్ణి (91), ఆదర్శ్ సింగ్ (66) హాఫ్‌సెంచరీలు చేశారు.

బజరంగ్ లేకుండానే..

న్యూఢిల్లీ: క్రొయేషియా వేదికగా జరిగే జాగ్రెబ్ ఓపెన్ కోసం అడ్‌హాక్ కమిటీ 13 మంది రెజ్లర్లను మంగళవారం ప్రకటించింది. అయితే స్టార్ రెజ్లర్లు బజరంగ్ పునియా, అంతిమ్ పంగల్ లేకుండానే భారత్ బరిలోకి దిగబోతున్నది. పురుషుల ఫ్రీ స్టయిల్ విభాగంలో 11 మందిని రెజ్లర్లను ఎంపిక చేశారు. వీరిలోఅమన్ షెరావత్(57కి), యశ్(74కి), దీపక్‌పునియా(86కి), వికీ(97కి), సుమిత్ మాలిక్(125కి) ఉన్నారు. తన గైర్హాజరీపై బజరంగ్ స్పందిస్తూ 'ఇటీవలే చేతి వేలుకు సర్జరీ అయ్యింది. దీంతో ఇప్పటికీ ప్రాక్టీస్ మొదలుపెట్టలేకపోయాను. సరైన సన్నద్ధత లేకుండా టోర్నీలో పోటీపడలేను. త్వరలోనే ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతాను' అని ఉంది. మరోవైపు మహిళల విభాగంలో సోనమ్ మాలిక్(62కి), రాధిక(68కి) ఇద్దరు మాత్రమే పోటీపడుతున్నారు.

విజయంతో మొదలు

బ్రిస్బేన్: స్పెయిన్ టెన్నిస్ స్టార్ రఫెల్ నాదల్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గాయం కారణంగా గతేడాది చాలా టోర్నీలకు దూరమైన నాదల్ వచ్చి రావడంతోనే సత్తాచాటాడు. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీలో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో నాదల్ 7-5, 6-1తో ప్రపంచ మూడో ర్యాంక్ ప్లేయర్ డొనిమిక్ థీమ్‌పై అద్భుత విజయం సాధించాడు. మ్యాచ్ తొలి సెట్‌లో ఆరు అనవసర తప్పిదాలు మినహాయిస్తే..37 ఏండ్ల నాదల్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు.

సమమా.. సమర్పణమా!

నేడు భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు • టీమ్‌ఇండియాకు కఠిన సవాల్ • మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

ఎన్నో ఆశలతో దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన టీమ్‌ఇండియా.. టెస్టు సిరీస్ విజయం సాధించి మూడు దశాబ్దాల కరువు తీరుస్తుందనుకుంటే అది అత్యాశే అయింది! ఇప్పుడు కనీసం 'డ్రా' అయినా చేయాలనే లక్ష్యంతో రోహిత్ సేన రెండో టెస్టుకు రెడీ అయింది. సెంచూరియన్‌లో సత్తాచాటలేకపోయిన పేసర్లు కేప్‌టౌన్‌లో రాణించేందుకు సిద్ధమవుతుండగా.. బ్యాటర్లు సమిష్టిగా కదం తొక్కాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. కోహ్లీ, రోహిత్, రాహుల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న కెప్టెన్ ఎల్గర్‌కు భారీ విజయంతో ఘనంగా వీడ్కోలు పలకాలని సఫారీలు చూస్తున్నారు!

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటన చివరి అంకానికి చేరుకుంది. టీ20 సిరీస్‌ను 'డ్రా' చేసుకొని.. వన్డే సిరీస్ చేజిక్కించుకున్న టీమ్‌ఇండియా.. ఇప్పుడు టెస్టు సిరీస్‌ను సమం చేసుకునేందుకు సమాయత్తమైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో ఘోర పరాజయం మూటగట్టుకున్న రోహిత్ గ్యాంగ్.. బుధవారం నుంచి సఫారీలతో రెండో టెస్టు ఆడనుంది. పేస్‌కు సహకరించిన సెంచూరియన్‌లో చేతులెత్తేసిన మనవాళ్లు.. క్లిష్టతరమైన కేప్‌టౌన్‌లో ఏం చేస్తారో చూడాలి! బాక్సింగ్‌డే టెస్టులో ఆతిథ్య జట్టు కేవలం 10 మంది బ్యాటర్లతోనే బరిలోకి దిగి సత్తాచాటగా.. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కూడా మనవాళ్లు సఫారీల దరిదాపుల్లోకి చేరలేకపోయారు. గాయం కారణంగా ప్రొటీస్ కెప్టెన్ టెంబా బవుమా రెండో టెస్టుకు దూరం కాగా.. అతడి స్థానంలో కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న ఎల్గర్ జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. గత మ్యాచ్‌లో పాలను సరిదిద్దుకొని సత్తాచాటేందుకు భారత ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశారు. తొలి మ్యాచ్‌లో ఘోర పరాజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోయిన భారత్ ఈ మ్యాచ్‌లో రాణించి సిరీస్ సమం చేయడంతో పాటు.. డబ్ల్యూటీసీ పాయింట్లలో మెరుగవ్వాలని చూస్తున్నది. ఇది సాధ్యపడాలంటే మనవాళ్లు సమిష్టిగా సత్తాచాటాల్సిన అవసరముంది.

జడ్డూ కమ్‌బ్యాక్

గాయం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తుది జట్టులోకి రానుండటంతో జట్టు బలం పెరగనుంది. అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్‌లో జట్టుకు సమతూకం తేవడంలో జడ్డూ కీలకం కానున్నాడు. తొలి టెస్టుతో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ప్రసిద్ధ్ కృష్ణ.. బౌన్స్ రాబట్టడంలో విఫలం కావడంతో అతడి స్థానంలో ముఖేశ్ కుమార్‌ను ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయి. ఈ రెండు తప్ప జట్టులో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. టాపార్డర్‌లో రోహిత్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సిన అవసరముంది. దక్షిణాఫ్రికాలో పేలవ రికార్డు ఉన్న హిట్‌మ్యాన్ ఇటు బ్యాటింగ్‌తో పాటు.. అటు సారథిగా జట్టును ముందుండి నడిపించాల్సి ఉంది. విరాట్ కోహ్లీ సారథ్యంలో జట్టులో కనిపించిన కసి ప్రస్తుత టెస్టు జట్టులో లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్న వేళ రోహిత్ దూకుడు కనబర్చాల్సి ఉంది. ఇక యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ తొందరపాటుకు పోకుండా.. మొదట క్రీజులో కుదురుకున్నాక.. ఆ తర్వాత అదునుచూసి భారీ షాట్లు ఆడటం మేలు. శ్రేయస్ షార్ట్ పిచ్ సమస్య నుంచి బయట పడకపోతే కష్టమే. గత మ్యాచ్‌లో రాణించిన విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్‌పై అభిమానులు మరోసారి భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక బౌలింగ్‌లో బుమ్రా ఒక్కడు తప్ప మిగిలిన వాళ్లు పెద్దగా ఆకట్టుకోలేపోయారు. మహమ్మద్ షమీ లేని లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తుండగా.. హైదరాబాదీ సిరాజ్ మెరవాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. మరోవైపు ఎల్గర్, మార్క్‌రమ్, జోర్జీ, కీగన్ పీటర్‌సన్, హమ్జా, వెరినే, జాన్సెన్‌తో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. రబడ, ఎంగ్డీ, జాన్సన్, బర్గర్ పేస్ దాడిని తట్టుకొని క్రీజులో నిలువడం భారత బ్యాటర్లకు శక్తికి మించిన పనే.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, జడేజా, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్/ముఖేశ్.

దక్షిణాఫ్రికా: ఎల్గర్ (కెప్టెన్), మార్క్‌రమ్, జోర్జీ, కీగన్ పీటర్సన్, హమ్జా, బెడింగ్‌హామ్, వెరినె, జాన్సెన్, కేశవ్/ఎంగ్డీ, రబడ, బర్గర్.

పిచ్, వాతావరణం

కేప్‌టౌన్ పిచ్ ఆరంభంలో పేసర్లకు సహకరించనుంది. కొత్త బంతితో సీమర్లు రెచ్చిపోవడం ఇక్కడ మామూలే. మ్యాచ్ సాగుతున్నా కొద్ది బంతి స్పిన్ తిరుగుతుంది. క్రీజులో నిలదొక్కుకుంటేనే పరుగులు సాధించడం సాధ్యం. మ్యాచ్ వర్షం ముప్పులేదు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.